క్లుప్తంగా

పేద విద్యార్థులకు అండగా ఆవోపా



విద్యార్థులకు స్టీల్ ప్లేట్‌లు పంపిణీ చేస్తున్న సభ్యులు

ఆళ్లగడ్డ: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సేవలందించేందుకు ఆవోపా ఎప్పుడూ ముందుంటుందని ఆవోపా ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు అన్నారు. పట్టణ శివారులోని హెచ్‌పీఎం ఎయిడెడ్ హైస్కూల్‌లో విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. విద్యకు పేదరికం అడ్డు కాకూడదన్నారు. నిరుపేద విద్యార్థులకు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వినోద్‌కుమార్, వెంకటసుబ్బయ్య, గోవిందరాజులు, సత్యనారాయణ, స్వప్నిక పాల్గొన్నారు.

ఎరుకలపై దాడులను అరికట్టాలి

ఆళ్లగడ్డ: గిరిజనులైన ఎరుకల కులస్తులపై జరుగుతున్న దాడులను పోలీసులు, అధికారులు అరికట్టాలని ఏపీ ఎరుకల సమైక్య సంస్థ జిల్లా అధ్యక్షుడు నాగార్జున అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూజజ గతంలో ఎన్నడూ లేని విధంగా సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పూర్తయినప్పటి నుంచి అహోబిలంలో కొందరు అగ్రవర్ణ కులస్తులు ఎరుకల కులస్తుల ఇళ్లపై దాడులు చేయడం విచారకరమన్నారు. మహిళలు, చిన్నపిల్లలు అని చూడకుండా దాడులకు ఉపక్రమించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. దాడులు అధికమవ్వడంతో అనేక మంది గ్రామం వదిలి పారిపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

3,694 పాఠ్య పుస్తకాల మంజూరు



మోడల్‌స్కూల్‌లో పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో విడత 3,694 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. మొదటి విడతగా 1,2 తరగతులకు పూర్తి స్థాయిలో, 6వ తరగతికి తెలుగు, గణితం పాఠ్య పుస్తకాలతో కలిపి 2,088, రెండో విడత 8,9,10 తరగతులకు అన్ని రకాల పాఠ్య పుస్తకాలు 10,331 మండల స్టాక్ పాయింట్‌కు చేరాయని పేర్కొన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు 2077 మంది విద్యార్థులకు 22 వేల పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందని తెలిపారు. ఇప్పటి వరకు 16,113 పాఠ్య పుస్తకాలు వచ్చాయని వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ పాఠశాల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుల ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ తెలిపారు.

కార్యాలయాలకు విద్యుద్దీప కాంతులు

నంద్యాల(సిటీ): నంద్యాల జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు అధికారులు. రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన టీడీపీ ప్రభుత్వం బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా ప్రతి కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. అంతే కాకుండా ప్రతి నియోజకవర్గం నుంచి 4 బస్సుల ద్వారా ప్రమాణ స్వీకారానికి ప్రత్యేక పాస్‌లు కలిగిన వారిని తరలిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై నంద్యాల మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా ప్రభుత్వం ఇచ్చిన సూచనలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో నంద్యాల జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని ప్రాంతాలలోని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయాలని ఆదేశాలు ఉన్నందున పట్టణంలోని జిల్లా కలెక్టరేట్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను అలంకరిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారానికి ప్రత్యేక పాస్‌లు కలిగిన వారిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

ఆళ్లగడ్డ: రూరల్ మండలం చింతకొమ్మదిన్నె గ్రామానికి చెందిన షేక్ ఫకూర్‌బీ అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్‌ఐ నరసింహులు మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ ఫకూర్‌బీకి ఏడేళ్ల క్రితం చాగలమర్రి మండలం శెట్టివీడు గ్రామానికి చెందిన కట్టుబడి హుస్సేన్ బాషాతో వివాహం జరిగింది. కొంత కాలంగా దంపతులు ఇద్దరూ గొడవ పడుతుండడంతో రెండు నెలల క్రితం ఫకూర్‌బీ పుట్టింటికి వచ్చింది. ఈ నెల 8వ తేదీ ఆరోగ్యం సరిగ్గా లేదని.. చాగలమర్రిలోని కేరళ ఆస్పత్రికి వెళ్లి చూయించుకుని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారిని విచారించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం ఫకూర్‌బీ అన్న ఫక్రుద్దీన్ స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మలేరియాపై పోరాటం ఉధృతం

- దోమల కట్టడితోనే మలేరియా నివారణ
- వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు
- పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి
- ఈనెల 30 వరకు మలేరియా మాసోత్సవాలు



మురుగునీటిలో వేస్ట్ ఆయిల్‌ను చల్లుతున్న దృశ్యం



నిల్వ నీటిని పారవేస్తున్న వైద్యసిబ్బంది

గోస్పాడు: మలేరియా జ్వరం అంటేనే గ్రామాల్లో చాలామంది ప్రజలు వణికి పోతారు. వర్షాకాలంలో దోమల వల్ల మలేరియా వ్యాప్తి చెందే అవకాశాలు ఉండటంతో వైద్య ఆరోగ్య శాఖ నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈనెల 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సంబంధిత అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరిశుభ్రత విషయంలో ప్రజలను అప్రమత్తం చేసి తగు చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చనే విషయాలపై కరపత్రాలను సైతం పంచుతున్నారు.

దోమల నివారణకు డ్రైడే..

దోమల వ్యాప్తిని నిరోధించేందుకు వారానికి ఒకరోజు పరిసరాలను పరిశుభ్రంగా చేయాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తున్నారు. కదలిక లేని నీటినిల్వలపై దోమలు లార్వా విడిచిపెడతాయి. ఆ లార్వా 8 నుంచి 10 రోజుల లోపు గుడ్డుగా మారి తద్వారా దోమగా రూపాంతరం చెందుతుంది. దోమల నివారణకు వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంటి పరిసరాల్లో ఉన్న చెత్తా చెదారాలను తొలగింపజేయడంతో పాటు మొక్కల కుండీలు, రుబ్బురోళ్లు, రిఫ్రిజిరేటర్లలో ఉన్న నీటి నిల్వలను తొలగించేలా చర్యలు తీసుకుంటున్నారు. వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు సంయుక్త ఆధ్వర్యంలో గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు అనవసర నీటినిల్వలపై అవగాహన కల్పిస్తున్నారు.

మలేరియా లక్షణాలు..

మలేరియా వ్యాధి అనాఫిలిస్ దోమ కాటు వల్ల వస్తుంది. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందువల్ల ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఉంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, జ్వరం రోజు మార్చి రోజు, రెండు మూడు రోజులకు ఒకసారి వస్తూ ఉంటుంది. మలేరియాలో వైవ్యాక్స్ మలేరియా తక్కువగా బాధిస్తే, ఫాల్సీఫారం మలేరియా ఎక్కువ బాధించడమే కాకుండా ఒక్కోసారి ప్రాణాంతక స్థాయికి చేరుతుందని వైద్యులు చెబుతున్నారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు ఈ వ్యాధి ప్రమాదకరమైనదని, రక్త పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించుకోవచ్చని పేర్కొంటున్నారు.

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పరీక్షలు..

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణను గంట వ్యవధిలోపు చేసే అవకాశం ఉంది. వ్యాధి నిర్ధారణ అయితే అందుకు అవసరమైన మాత్రలను ఉచితంగా అందిస్తారు. నిర్దేశించిన గడువు ప్రకారం మందులను క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది.

దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇంటి కిటికీలు, తలుపులు, లెట్రిన్ పైపునకు మెష్ ఏర్పాటు చేయాలి.
- రాత్రి సమయాల్లో దోమతెరలను వినియోగించుకోవాలి.
- సాయంత్రం నుంచి శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వేసుకోవాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- తాగునీటి నిల్వలపై మూతలు వేయాలి.
- వాడుకలో లేని సామగ్రిని బోర్లించి ఉంచాలి.
- వారానికోసారి ఇంటి పరిసరాల్లోని వాడకం కోసం ఉంచిన నీటి నిల్వలను మార్చుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు ఉంటే వేస్ట్ ఆయిల్, కిరోసిన్ పోయాలి.
- ఇంటి పరిసరాల్లో టైర్లు, తాగిపారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు లేకుండా చూడాలి.
- ఇంటి ఆవరణలో దోమ వికర్షణలైన బంతి, తులసి, పుదీనా, లావెండర్, రోజ్ మేరీ వంటి మొక్కలు పెంచుకోవాలి.

పరిసరాల శుభ్రత పాటించాలి



దోమల కాటు వల్ల మలేరియా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ వ్యాధి వ్యాపించడానికి స్థానిక పరిస్థితులు, పరిసరాల శుభ్రతపై ఆధారపడి ఉంటుంది. రక్త మార్పిడి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. మలేరియా బాధితుడిని కుట్టిన దోమ ఇంకొకరిని కుట్టడం ద్వారా కూడా మలేరియా సోకుతుంది. సీజన్‌లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

–డాక్టర్ గోపాల్, గోస్పాడు వైద్యాధికారి

ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నాం



వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దోమల వల్ల మలేరియా, ఇతర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాం. వ్యాధి నివారణ అనేది మనం తీసుకొనే జాగ్రత్తలపై ఆధారపడి ఉంటుంది. పరిసరాల్లో మురుగునీరు లేకుండా, దోమల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలి. మలేరియాపై సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేకంగా మలేరియా మాసోత్సవ కార్యక్రమం ద్వారా చైతన్య పరుస్తున్నాం.

– వెంకటేశ్వరరెడ్డి, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్, నంద్యాల

జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవం..

జూన్ నెలంతా జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవంగా పాటిస్తూ గ్రామాల్లోను, శివారు ప్రాంతాల్లోను ప్రజలకు మలేరియాపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతోపాటు చలి, వణుకుతో కూడిన జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం



మలేరియా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

నంద్యాల(అర్బన్): మలేరియాను నిర్మూలనకు పోరాటాన్ని ఉధృతం చేద్దామని చాపిరేవుల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ షహలాం పిలుపునిచ్చారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బందితో మలేరియా నివారణపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమల వల్ల వ్యాపించే మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అతిసార వ్యాధి బారిన పడ్డ చిన్నారులకు ఓఆర్ఎస్, జింకును సరైన మోతాదులో ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వరాజ్యం, ఎంపీహెచ్ఈఓ హరినాథ్, సూపర్‌వైజర్లు బేబీకుమారి, అన్నమ్మ, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో ఆటపాటలతో విద్య



బడిబాట కార్యక్రమంలో సీడీపీఓ తేజేశ్వరి

ఆళ్లగడ్డ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడా ప్రాథమిక విద్య ఉంటుందని.. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని ఆళ్లగడ్డ ఐసీడీఎస్ సీడీపీఓ తేజేశ్వరి కోరారు. మంగళవారం ఆళ్లగడ్డలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. పిల్లలకు చక్కటి విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ దస్తగిరమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలను ప్రోత్సహించండి



పంటల సాగుపై చర్చిస్తున్న ఏపీడీ

శిరివెళ్ల: ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంటల సాగుపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు.. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 900 ఎకరాల్లో ఉద్యానవన పంటల సాగు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇంత వరకు 309 ఎకరాలను గుర్తించామన్నారు. శిరివెళ్ల మండలంలో 100 ఎకరాలకు గాను 40 ఎకరాలను గుర్తించి 10 ఎకరాల్లో పంటల సాగుకు అంచనా పంపామని తెలిపారు. అలాగే 20 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యం కాగా ఇంత వరకు 12 లక్షల పనిదినాలను కూలీలలకు కల్పించామని పేర్కొన్నారు. ఇందు కోసం రూ. 28 కోట్ల వేతనాలను కూలీలుకు చెల్లించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణి రాజకుమారి, ఏపీఓ రామసుబ్బయ్య పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



సంజీవనగర్ రామాలయంలో ప్రత్యేక అలంకారంలో శ్రీవెంకటేశ్వరస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబా చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవా కార్యక్రమం చేపట్టారు. వడిబియ్యం సమర్పించి, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహా మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం అమ్మవారికి నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామికి ..

పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామికి ఉదయం శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో అష్టాదళ పాదపద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా 108 బంగారు పుష్పాలచే అష్టోత్తర నామ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.

వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఎస్టీ పునరుద్ధరణపై సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరిస్తామంటూ రాజకీయ పార్టీల నాయకులు హామీలు ఇస్తున్నారన్నారు. అధికారం చేపట్టిన తర్వాత వాల్మీకుల అంశాన్ని మరిచిపోతున్నారని, గెలిచిన పార్టీలు వాల్మీకుల అంశంపై నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. పునరుద్ధరణపై కొత్త ప్రభుత్వం ముందుకు సాగకపోతే వాల్మీకులు పునరాలోచన చేసుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, జయరాం, మదనగోపాల్, శ్రీనివాసులు, కుమార్, బాలు, మల్లికార్జున, పరమేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కుందూనది బ్రిడ్జి వద్ద కొట్టుకొచ్చిన గుర్రపు డెక్క



కుందూకు తగ్గిన వరదనీరు

ఉయ్యాలవాడ: కుందూలో మంగళవారం వరద నీటి ప్రవాహం తగ్గింది. వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి కుందూ నదికి భారీగా వరద నీరు చేరింది. ప్రమాదస్థాయిలో నీరు ప్రవహించింది. ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గింది. నదీ తీరం వెంట ఉన్న మండలంలోని 14 గ్రామాల రైతులు ఖరీఫ్‌లో వరి సాగు కోసం సమాయత్తమవుతున్నారు. కాగా ఎగువ ప్రాంతాల నుంచి భారీగా గుర్రపు డెక్క కొట్టుకొచ్చింది. గుర్రపుడెక్క ఉయ్యాలవాడ వద్దనున్న వంతెన సమీపంలో నిలిచి ప్రవాహానికి అడ్డుగా మారింది. కేసీ కెనాల్ అధికారులు చొరవ తీసుకుని గుర్రపుడెక్కను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



చాగలమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చాగలమర్రి: మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని చాగలమర్రి పీహెచ్‌సీ ప్రభుత్వ వైద్యాధికారి షేక్ ఇమ్రాన్ సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. చలి, వణుకుతో కూడుకున్న జ్వరం వస్తే మలేరియా లక్షణాలుగా భావించాలని తెలిపారు. ఇది ప్లాస్మోడియం అనే పరాన్న జీవి వల్ల వస్తుందన్నారు. ఈ వ్యాధి ఏనాఫిలస్ దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ వ్యాధి నివారణకు ముందు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. వర్షాకాలంలో దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రమణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(సెంట్రల్): పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ...రానున్న వర్షాకాలంలో పశువులు ఎక్కువగా సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, ముందస్తుగా టీకాలు వేయించి వీటి నుంచి రక్షణ పొందాలన్నారు. వైద్యానికి మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మూగజీవాలకు పెద్ద వ్యాధులు సోకితే నిర్ధారణకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అలాగే దూరప్రాంతాల నుంచి పశువులను ఆస్పత్రికి నడిపించి తీసుకురాకుండా సంచార పశువైద్యశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆయా సేవల ద్వారా సత్వరమే పశువులకు వైద్యసేవలు అందుతుండటంతో గతంలో కన్నా ఇప్పుడు పశు మరణాలు తగ్గాయని వెల్లడించారు. ఆర్‌బీకేలలో లభించే గడ్డి విత్తనాలు నాటుకుని, తద్వారా లభించే పశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తిని పొందాలని సూచించారు.

ఆగని వాన.. ఆందోళనలో రైతన్న



రుద్రవరంలో కురుస్తున్న వర్షం

రుద్రవరం: మండలంలో మూడు రోజుల నుంచి వర్షం కురుస్తోంది. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే వర్షాలు మొదలయ్యాయి. రుద్రవరం, రెడ్డిపల్లె, నర్సాపురం, ఆలమూరు, చిత్రేనిపల్లె, ఎర్రగుడిదిన్నె, పేరూరు తదితర గ్రామాల పరిధిలోని రైతులు వేరుశనగ, మినుము, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేశారు. ప్రస్తుతం ఆ పంటలు వివిధ దశల్లో ఉన్నాయి. మంగళవారం సాయంత్రం నుంచి ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తోంది. పొలాల్లో నీరు నిల్వ చేరి వేరుశనగ విత్తనాలు భూమిలోనే కుళ్లిపోతాయని, అలాగే మొలక దశలో ఉన్న మినుము, మొక్కజొన్న దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి

ఉయ్యాలవాడ: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి అపర్ణ అన్నారు. మంగళవారం స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో చిన్నారులకు దగ్గు, జ్వరం, విరేచనాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారిని సమీప ఆరోగ్య కేంద్రాలకు తీసుకొచ్చి చికిత్స చేయించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు దస్తగిరి, రామచంద్రుడు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

గోస్పాడు: మాతాశిశు సంరక్షణకు కృషి చేయాలని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు నమోదు అయిన రోజు నుంచి ప్రసవం జరిగిన సంవత్సరం వరకు కేంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాతాశిశు సంరక్షణ సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గర్భిణులకు రక్త, మూత్ర పరీక్షలతో పాటు మధుమేహం, హిమోగ్లోబిన్, రక్తపోటు వంటి నిర్ధారణ పరీక్షలు చేశారు. రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటరమణ, సూపర్‌వైజర్ మద్దమ్మ, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

నంద్యాల(న్యూటౌన్): డీవైఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ కార్యదర్శిగా శివ, అధ్యక్షుడిగా వంశీ, సహాయ కార్యదర్శులుగా సాయి, సురేష్, మహేష్, జావీద్, ఉపాధ్యక్షులుగా నాగన్నలను ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం యువతీ, యువకులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలన్ని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాగన్న, చిరు, హరి, జావీద్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో పుస్తకాల వ్యాపారం..

నంద్యాల జిల్లాలో ప్రైవేటు విద్యాసంస్థల్లో పుస్తకాల వ్యాపారం జరుగుతుందని, ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్, కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లోనే పుస్తకాలు కొనుగోలు చేయాలని యాజమాన్యం ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మహానందిలో భక్తజన సందడి

మహానంది: మహానందిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మంగళవారం రెండు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేలాది మంది భక్తులరాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓలు వై.మధు, ఓంకారం వేంకటేశ్వరుడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అర్జునాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

బడిబాట ర్యాలీ

దొర్నిపాడు: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని క్రిష్టిపాడు, అర్జునాపురం గ్రామాల్లో అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే సేవలు, పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మార్తమ్మ, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.